క్లుప్తంగా

ఘనంగా పైడితల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



గంధవరంలోని పైడితల్లమ్మ విగ్రహం

పద్మనాభం: మండలంలోని గంధవరంలోని మూడు రోజులు జరగనున్న పైడితల్లమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా రాత్రి గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను, పలు ప్రవచనాలు ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బీచ్‌ను సందర్శించిన వీల్ చైర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు



బీచ్‌ను సందర్శించిన వీల్‌చైర్ బాస్కెట్ బాల్ మహిళా క్రీడాకారులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌ను ఆదివారం సాయంత్రం మణిపూర్, మహారాష్ట్రకు చెందిన 21 మంది వీల్‌చైర్ బాస్కెట్ బాల్ మహిళా క్రీడాకారులు సందర్శించారు. నిత్యం క్రీడల్లో నిమగ్నమైన వీరికి మానసిక ఉల్లాసం కోసం ఇలా బీచ్‌కు తీసుకుని వచ్చినట్లు కోచ్ కెప్టెన్ లూయిస్ తెలిపారు. వీరికి మెరైన్ పోలీసులు వెంకటరమణ తదితరులు సహాయం అందించారు.

సంద్రంలో చిక్కుకున్న పర్యాటకులు



పర్యాటకులను కాపాడుతున్న లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఇద్దరు యువకులు చిక్కుకున్నారు. పెందుర్తికి చెందిన జి. భాస్కర్, ఎంవీ ఆదిత్య ఆదివారం మధ్యాహ్నం బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరు సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరిద్దరు స్నానాలు చేస్తూ సముద్రంలోపల చిక్కుకున్నారు. ఈత రాని వీరు పరిస్థితిని గమనించి పెద్దగా కేకలు వేశారు. ఇది గమనించిన లైఫ్‌గార్డ్ చందు అప్రమత్తమై మిగిలిన లైఫ్‌గార్డ్స్‌తో కలిసి పడవపై వెళ్లి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పీఎం పాలెం: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది గ్యాస్ గోదాముకు సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 60 ఏళ్ల గల మృతదేహాన్ని కనుగొన్నారు. మరణించిన వ్యక్తి ఎడమ చేతికి చిటికెన వేలుకు రాగి ఉంగరం ఉందని, అతని మెడలో రెండు తాయెత్తులు ఉన్నాయని, నలుపు రంగుపై తెలుపు చుక్కలు, లేత గ్రీన్ చెక్స్ ఉన్న ఆరెంజ్ రంగు చొక్కా ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుని ఆనవాళ్లు బట్టి గుర్తించిన వారు 94407 96060 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని సీఐ ప్రజలను కోరారు.



'గతంలో వైద్య నిపుణులు ఉండటంతో రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఆయా విభాగాలకు సంబంధించి రోగులు సలహాలు, సూచనలు పొందేవారు. ముఖ్యంగా స్త్రీ వైద్య నిపుణురాలు ఉండటం ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు వారు లేకపోవడం పెద్ద లోటుగా ఉంది' అని మామిడిపాలేనికి చెందిన రాజేటి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు.



'ఆస్పత్రిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. గతంలో మాదిరిగా వైద్య నిపుణులను కొనసాగించాలి. పూర్తి స్థాయిలో వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని భీమిలికి చెందిన ఎస్. రమేష్ కోరారు.

ఆరోగ్య కేంద్రంలో సమస్యల తిష్ట

- కనీస వసతులు శూన్యం
- మరుగుదొడ్లు, తాగునీటికి ఇబ్బందులు
- ప్రత్యేక వైద్య నిపుణులు లేక అవస్థలు



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భీమునిపట్నం: భీమిలి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనేక సమస్యలతో సతమతమవుతోంది. ఇక్కడ కనీస సదుపాయాలు కూడా లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. అంతేకాకుండా, రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం **అందడం లేదని** స్థానికులు ఆవేదన వ్యక్తం **చేస్తున్నారు.**

చిన్నబజారు సమీపంలో **ఉన్న ఈ ఆరోగ్య కేంద్రానికి** జ్వరాలు, సాధారణ **ఆరోగ్య సమస్యల** కోసం ప్రజలు వస్తుంటారు. ప్ర**స్తుతం ఇక్కడ ఒక** వైద్య అధికారి, ఇద్దరు స్టాఫ్ న**ర్సులు, ఒక ల్యాబ్** టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, **డేటా ఎంట్రీ ఆపరేటర్**, అటెండర్‌తో కలిపి **మొత్తం ఏడుగురు** సిబ్బంది ఉన్నారు. అయితే, **గత వైఎస్సార్‌సీపీ** ప్రభుత్వ హయాంలో ఇక్కడ **పలువురు వైద్య నిపుణులు అందుబాటులో ఉండేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వారిని తొలగించిందని స్థానికులు చెబుతున్నారు.**



అందుబాటులో ఉన్న మందులు

వైద్య నిపుణులు లేకపోవడం పెద్ద సమస్య

ఆస్పత్రిలో వైద్య నిపుణులు లేకపోవడం ఇక్కడి ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. గత ప్రభుత్వ హయాంలో పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ వంటి ప్రత్యేక వైద్య నిపుణులు రోగులకు సేవలు అందించేవారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారిని తొలగించడంతో ప్రత్యేక వైద్య సేవలు పొందడం కష్టంగా మారింది. దీంతో చిన్న సమస్య వచ్చినా విశాఖపట్నం నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

రోగుల ఇబ్బందులు

గతంలో స్త్రీ వైద్య నిపుణులు ఉండటంతో గర్భిణులకు అవసరమైన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ అందుబాటులో ఉండేది. దాని ద్వారా గర్భిణులకు ఇక్కడే స్కానింగ్ చేసేవారు. అయితే, ప్రస్తుతం ఆ స్కానింగ్ మిషన్‌ను అధికారులు వేరే ప్రాంతానికి తరలించడంతో గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం లేకుండా పోయింది. అలాగే, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఇక్కడ తాగునీటి కొరత తీవ్రంగా ఉంది.



స్త్రీ వైద్య నిపుణులు ఉన్నప్పుడు ఇక్కడే గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహించేవారు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అధికారుల దృష్టికి తీసుకువెళ్లా..



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రధాన సమస్యలు, రోగుల ఇబ్బందులను అధికారులకు తెలియజేశాం. త్వరలో వీటిని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అలాగే, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

– కళ్యాణ చక్రవర్తి,
ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో 5వ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 162 మంది విద్యార్థులకు గాను 110 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగింది. ఈ పరీక్షకు 227 మంది విద్యార్థులకు గాను 168 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ శాంతికుమారి తెలిపారు.

శభాష్ పోలీస్



పర్యాటకుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఓ పర్యాటకుడికి హఠాత్తుగా గుండెనొప్పి రావడంతో మెరైన్ పోలీసులు స్పందించి ఆస్పత్రికి తరలించారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే అఫిజల్ రెహ్మాన్ తమ కుటుంబంతో కలసి ఆదివారం బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరందరూ స్నానాలు చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో రెహ్మాన్‌కు ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు పెద్దగా కేకలు వేశారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు ఇది గమనించి వెంటనే ఆయన వద్దకు చేరుకుని 108కు సమాచారం అందించి, సమయానికి ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సకాలంలో స్పందించిన మెరైన్ పోలీసులను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

వసతి కల్పించాలని వినతి



కేరళ ట్రావన్‌కూర్ దేవస్థానం అధికారులకు వినతి పత్రాన్ని అందిస్తున్న అయ్యప్ప సేవా సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో శబరిమలైకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలని కోరుతూ ఆదివారం ట్రావన్‌కూర్ దేవస్థానం అధికారులకు సేవా సంఘ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంఘ అధ్యక్షులు కొమ్మినేని ఎర్రునాయుడు, కార్యదర్శి మొకర నర్సింగరావు, కర్ణాటకలోని బెల్గాంకు చెందిన గురుస్వామి సరేష్, భీమిలి మండలం లక్ష్మీపురం అయ్యప్ప సేవా పీఠం గురుస్వామి గాడు తాతినాయుడు, ఇతర పెద్దలు అక్కడి ముఖ్య అధికారులను కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు సరైన వసతి లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్ల ఇక్కడకు వచ్చేవారికి తగిన వసతి సదుపాయాలు కల్పించాలని, దీనికి అవసరమైన డిపాజిట్లు చెల్లిస్తామని వారు కోరారు.దీనికి స్పందించిన అక్కడి అధికారులు తప్పకుండా వసతులు కల్పిస్తామని, త్వరలో దీనిపై సమాచారం అందిస్తామన్నారు.

సమీకృత హాస్టల్ మరమ్మతులకు రూ.32 లక్షలు



మధురవాడ బీసీ బాలుర సమీకృత హాస్టల్ జరుగుతున్న పనులు

మధురవాడ: మధురవాడలోని సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం మరమ్మతులకు అధికారులు రూ. 32 లక్షలు మంజూరు చేశారు. మరుగుదొడ్లకు చెందిన తలుపులు, టైల్స్, పైపులు వంటివి బాగా శిథిలం అయిపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారు. వీరి ఇబ్బందులపై సాక్షి పత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు మరుగుదొడ్లు, కిటికీలు, తలుపులు తదితర మరమ్మతు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. విద్యార్థుల ఇబ్బందులు తీరనున్నాయి.

సర్వే నంబర్ 1లోని ల్యాండ్ పూలింగ్ రైతుల వినతి



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న మజ్జి వెంకటరావు, తర్లువాడ రైతులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ సర్వే నంబర్ 1లో ప్రైవేట్ కంపెనీ కొరకు ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరిస్తున్న భూముల రైతుల పేర్లన్నీ నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో రైతులతో కలిసి వెళ్లి వినతి పత్రం అందజేశారు. 25 మంది రైతులు 30 ఏళ్లుగా సుమారు 25 ఎకరాల అనుభవంలో ఉన్నారని, వారికి నష్టం జరగకుండా చూడాలని కోరారు. అలాగే గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కొరకు ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన అయిదుగురు రైతులకు చెందిన అయిదు ఎకరాలకు బదులుగా అయిదేసి సెంట్ల భూమి ఇవ్వడానికి అంగీకరించి ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందించిన గంటా శ్రీనివాసరావు రైతులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. మండలంలో ఉన్న కూటమి నాయకులు తమతో కలిసి రావాలని రైతులు కోరారని ఆయన పేర్కొన్నారు. గంటాను కలిసిన వారిలో కోరాడ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న సీఐ తిరుమలరావు



పద్మనాభం జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని అంబేడ్కర్ కాలనీలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతిని ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ తిరుమరావు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు, పరమి భువనేశ్వరి, కొప్పల రమేష్ సహకారంతో వంద మంది మహిళా పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు వాసుపల్లి కొండబాబు, బోని ప్రసాద్, బోని సన్నిబాబు, భాగం లక్ష్మి పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని రెండు గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరిశుభ్రం చేశారు. పద్మనాభం జంక్షన్‌లోని అంబేడ్కర్ స్మృతి వనం, పాండ్రంగిలోని అంబేడ్కర్ విగ్రహం పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ముందుస్తుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు తమటపు నాగమణి, మాజీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు , బీజేపీ మండల శాఖ కార్యదర్శి సిరిపురపు వెంకటరావు, పి.కృష్ణారావు, కె.పేర్రాజు పాల్గొన్నారు.

కాలుష్య కాసారంగా గెడ్డలు



గోస్తనీనది గెడ్డలో పేరుకుపోయిన చెత్త

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస శివాలయాన్ని ఆనుకుని ఉన్న గెడ్డ కాలుష్య కాసారంగా మారిపోయింది. ఉత్తరవాహినిగా ఉన్న ఈ గెడ్డను భక్తులు పవిత్రంగా భావిస్తారు. గతంలో శివాలయానికి వచ్చేవారు దీనికి అభిముఖంగా ఉన్న ఈ గెడ్డలో స్నానాలు ఆచరించి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. కార్తీక పుణ్యస్నానాలు ఇక్కడే చేసేవారు. నిత్యం ప్రవహించే ఈ గెడ్డలో చేపల వేట కూడా సాగించేవారు. ఇటీవల గెడ్డకు ఎగువ భాగం ఆక్రమణకు గురవడంతో పాటు డెబ్రిస్ వేయడంతో చాలా వరకు గెడ్డ పూడుకుపోయింది. దీంతో సంగివలస గ్రామస్తులు ఈ పవిత్రమైన గెడ్డను డంపింగ్ యార్డుగా మార్చివేశారు. నిత్యం గెడ్డలో నీటి ప్రవాహం జరిగితే శ్రీబాసర లే అవుట్, బాలాజీనగర్, వెంకటేశ్వరమెట్ట మీదుగా నీరు గోస్తనీ నదిలో కలుస్తుంది. దీంతో ఈ మార్గంలోని వెంకటేశ్వరమెట్ట వద్ద బాడాలో చేపలు పెరిగి పెద్దవి అవుతాయి. ఇప్పుడు గెడ్డ మూసివేత కారణంగా నీటి ప్రవాహం నిలిచి బాడాలో చేపలు చనిపోతాయని అక్కడివారు అంటున్నారు.

గోస్తనీనది పరిసరాలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ గోస్తనీ నది తీరం వద్ద పందుల పెంపకం చేపడుతున్న ప్రదేశాన్ని పంచాయతీ కార్యదర్శి కె. ప్రసాద్ జోక్యంతో పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఇటీవల పందుల పెంపకం దారులు గోస్తనీ నదిలో ఊటబావులతో నీటిని సేకరిస్తున్న ప్రాంతంలో హోటళ్ల నుంచి తీసుకువచ్చిన ఆహార పదార్థాలు, కెమికల్ డబ్బాలను డంప్ చేస్తుండటంతో ఈ ప్రాంతంలో నదీ జలాలు కలుషితమవుతోంది. దీంతో ఈ నెల 11న 'గోస్తనీ నది కలుషితం' శీర్షికతో సాక్షిలో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో మూడు రోజుల పాటు తటపటాయించిన పంచాయతీ అధికారులు స్థానికుల ఒత్తిడితో వ్యర్థాలను తొలగించారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో పందుల పెంపకం కారణంగా వాటి మలమూత్రాలు నదిలో కలిసి తాగునీరు కలుషితం అవుతున్నందున వీటి పెంపకం చేపట్టకుండా చూడాలని పంచాయతీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



వ్యర్థాలు తొలగించిన అనంతరం గోస్తనీనది తీరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు

తగరపువలస: ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతికూల వాతావరణ పరిస్థితుల నడుమ కొట్టుమిట్టాడుతోంది. ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రెండు గదులు మాత్రమే కళాశాల నిర్వహణకు కేటాయించారు. దీంతో ఫస్టియర్, ఫైనలియర్‌లకు చెందిన ఆరు తరగతులు ఈ రెండు గదులు, వరండాలోనే నిర్వహించవలసి వస్తోంది. బోధనకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించినప్పటికీ మిగిలిన ఎలాంటి వసతులు లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కళాశాల పట్ల ఆదరణ చూపించడం లేదు. కనీసం ఈ జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న పేద విద్యార్థులు కూడా బయటకు వెళ్లిపోతున్నారు. రూ.1200 ఫీజు చెల్లించి కళాశాలలో చేరమన్నా సుముఖత చూపడం లేదు. గతేడాది ఈ కళాశాల నుంచి ఫస్టియర్, ఫైనలియర్ కలిపి 23 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 8 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఈ కళాశాలకు వసతులు కల్పించాలని ఇక్కడి విద్యార్థులతో పాటు అధ్యాపకులు, ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.



ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఘనంగా మట్టల ఆదివారం ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



వుడా కాలనీ ట్రినిటీ చర్చి వద్ద మట్టలతో పాటలు పాడుతున్న క్రైస్తవులు

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారం ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టలను పూలతో అలంకరించి, వాటితోపాటు ప్లకార్డులు పట్టుకుని పెద్దబజారు, మెయిన్‌రోడ్డు, చిన్నబజారు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ రెవరెండ్ గిడియన్ విజయకుమార్ మట్టల ఆదివారం గురించి వివరించారు. చర్చి సంఘ అధ్యక్షులు కె.ఎస్.ఎం. సుధాకర్, ఇతర సభ్యులు పి.ఎస్. చంద్, ఆల్బర్ట్ సుదర్శన్, విలియం కేరీ, స్టీవెన్, మోహన్‌కుమార్, విజయమ్మ, రొనాల్డ్ పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ: సర్వ మానవాళి సంక్షేమం కోసం ప్రాణాలర్పించిన ప్రభువు ఏసుక్రీస్తు అని మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ట్రినిటి లూథరిన్ చర్చి ఫాస్టర్ రెవరెండ్ ఎస్ ప్రసాదరావు చెప్పారు. మట్టలు ఆదివారాన్ని పురస్కరించుకుని ఆయన ఆధ్వర్యంలో చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనకు విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఖర్జూర మట్టలు చేతపట్టుకుని దేవుని స్తుతిస్తూ, పాటలు పాడుతూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీ సమాజం, యవ్వన సమాజం, సండే స్కూలు పిల్లలు విశేషంగా పాల్గొన్నారు.



వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆలయ సముదాయ నిర్మాణానికి భూమిపూజ



ఆకెళ్ల నరసింహమూర్తి గురుస్వామి ఇంటి వద్ద ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పండితులు

తగరపువలస: చిట్టివలసలో ఆకెళ్ల గురుస్వామి జ్ఞాపకార్థం ఆయన కుమారులు నిర్మించే ఆలయ సముదాయానికి ఆదివారం భూమి పూజ జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ఆయన కుమారులు భాగ్యరాజా, రవిగణేష్ దంపతులు పాల్గొనగా పండిత పురోహితులు ముహూర్త కాలం ఉదయం 8.34 గంటలకు పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సంపత్ వినాయకుడు, పార్వతీపరమేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవారు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వాములకు ఆలయాలు నిర్మిస్తామన్నారు. విజయదశమి నాటికి ఆలయ నిర్మాణాలు, ప్రతిష్ఠ కార్యక్రమాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి గురుస్వామి శిష్య బృందం, భక్తులు పాల్గొన్నారు.